సాక్షి
నంద్యాల
గురువారం । 7 । మార్చి । 2024



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: అన్నప్రసాద వితరణ పథకానికి బుధవారం వికారాబాద్‌కు చెందిన బి.బిచ్చప్ప రూ.1,00,101 విరాళాన్ని అన్నదాన పర్యవేక్షకులు సి.మధుసూదన్‌రెడ్డికి అందజేశారు.



సాంస్కృతిక ప్రదర్శనలు

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలంలో బుధవారం ఆయా వేదికలపై సంప్రదాయ నృత్యప్రదర్శనలు, భక్తిరంజని, హరికథ కార్యక్రమాలను నిర్వహించారు.

ఉష్ణోగ్రత

కనిష్టం	25.6
గరిష్టం	39.7

న్యూస్‌రీల్

నేడు 'వైఎస్సార్ చేయూత'

- జిల్లాలో 7,254 మందికి 182.35 కోట్ల లబ్ధి

నంద్యాల(న్యూటౌన్): మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేసేలా రాష్ట్ర ప్రభుత్వం 'వైఎస్సార్ చేయూత' పథకం కింద నాలుగో విడత నిధులు గురువారం మంజూరు చేయనుంది. మహిళలు తమకు ఆసక్తి కలిగిన వృత్తులు, వ్యాపారాలు కొనసాగించేందుకు ప్రభుత్వం చేయూత నందిస్తోంది. ఇందులో భాగంగా గురువారం అనకాపల్లి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నగదును అకౌంట్లలో జమ చేస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 97,254 మంది లబ్ధిదారులకు చేయూత పథకం కింద 182.35 కోట్లను విడుదల చేయనున్నారన్నారు. జిల్లాలోని డీఆర్‌డీఏ, వెలుగు, ఐకేపి సిబ్బంది, మహిళా పొదుపు సంఘాల లీడర్లు నంద్యాల కలెక్టరేట్‌లో జరిగే సమావేశానికి హాజరు కావాలన్నారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు రూ. 2.59 కోట్లు

నంద్యాల (సెంట్రల్): శ్రీశైలం ప్రాజెక్ట్ పరిధిలో రూ.2.59 కోట్లతో పలు పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. 12 రేడియల్ క్రస్ట్ గేట్ల ప్రత్యేక మరమ్మతులలో భాగంగా రబ్బర్ సీళ్లు, ఈఎమ్ బ్రేకులు, పాడైపోయిన చెక్కర్డు ప్లేటు, కేబుల్, గ్యాంట్రీ క్రేను క్యాబిన్ మరమ్మతు ఖర్చులకు రూ.1.59 కోట్లు విడుదలకు ఆదేశాలు జారీ చేసింది. అలాగే డ్యాం సైట్ వద్ద కాలిపోయిన 2000 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో ఒక్కొక్కటి 1000 కేవీఏ సామర్థ్యం ఉన్న రెండు నియంత్రికల ఏర్పాటుకు రూ.కోటి మంజూరుకు పాలనా అనుమతులు జారీ చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి శశిభూషణ్ కుమార్ జీవో నెంబరు 63ను విడుదల చేశారు.

హాల్ టికెట్లను పరిశీలించుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లు WWW. bse.ap.gov.in అందుబాటులో ఉన్నాయని, ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని డీఈఓ సుధాకర్ రెడ్డి ఒక ప్రకటనలో బుధవారం సూచించారు. జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలకు సంబంధించిన విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించి మీడియం, సబ్జెక్టు విషయంలో ఏవైనా సవరణలు ఉంటే వెంటనే ప్రభుత్వ పరీక్షల సంచాలకుల వారి ఈ మెయిల్ dir& govexams@yahoo.com ద్వారా తెలియజేయాలన్నారు.

857 మంది విద్యార్థులు గైర్హాజరు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో బుధవారం జరిగిన ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలకు 744 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీవీఈఓ సునీత తెలిపారు. 52 పరీక్ష కేంద్రాల్లో మ్యాథ్స్-1ఎ, బోటనీ-1, సివిక్స్-1 సబ్జెక్టుల పరీక్షలు జరిగాయి. 14,481 మంది విద్యార్థులకు గాను 13,737 మంది హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ పరీక్షలకు 1,321 మందికి గాను 1,208 మంది హాజరు కాగా 113 మంది గైర్హాజరయ్యారన్నారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, రెండు టీంలు సిట్టింగ్ స్క్వాడ్‌లు తనిఖీలు చేపట్టాయి.

ప్రశాంతంగా ముగిసిన టెట్

నంద్యాల(న్యూటౌన్): గత నెల 27వ తేదీ నుంచి ప్రారంభమైన టెట్ (టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్) బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. జిల్లాలో నాలుగు పరీక్ష కేంద్రాల్లో జరిగిన ఆయా పరీక్షలకు 6,854 మంది అభ్యర్థులు హాజరు కావలసి ఉండగా 6,250 మంది హాజరయ్యారు. 604 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

టూరిజం రెస్టారెంట్ల లీజుకు టెండర్ల ఆహ్వానం

నంద్యాల(సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలోని ఏర్పాటు చేసిన మూడు రెస్టారెంట్ల నిర్వహణకు లీజు పద్ధతిన ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ప్యాపిలి మండలం బోయవాండ్లపల్లి వాల్మీకి గుహల రెస్టారెంట్, బేతంచెర్ల మండలం బిల్వ సర్గం గుహల రెస్టారెంట్, డోన్ మండలం వెంకటాపురం అబ్బిరెడ్డిపల్లె చెరువు రెస్టారెంట్లను మూడు సంవత్సరాల కాల పరిమితితో లీజుకు ఇవ్వాలని, ఒక్కో దానికి సంవత్సరపు లీజు రూ.24 వేలుగా నిర్ణయించామని, ఈనెల 12వ తేదీ వరకు జిల్లా పర్యాటక శాఖ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. 13వ తేదీన టెండర్లు తెరుస్తామన్నారు. టెండరు ధరావతు రూ. 2 వేలను జిల్లా కలెక్టర్ పేరు మీద చెల్లించి ఫారాలు పొందాలన్నారు. ఈ సొమ్ము తిరిగి చెల్లించబడదన్నారు. మరిన్ని వివరాలకు 7995087089, 8297098022ను సంప్రదించాలని తెలిపారు.

కొనుగోలు.. గట్టి మేలు

- అందుబాటులో 'మద్దతు ధరతో' కొనుగోలు కేంద్రాలు
- రైతులు దళారుల బారిన పడకుండా చర్యలు
- టీడీపీ పాలనలో ధాన్యం కొనుగోళ్లు రికార్డులకే పరిమితం
- నేడు పంటకు ముందే ఎంఎస్‌పీ ప్రకటన.. నూర్పిళ్లలోనే కొనుగోళ్లు
- సంచులు, రవాణా, హమాలీల ఖర్చులు కూడా చెల్లిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

ఆళ్లగడ్డ: రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిన రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు అడుగడుగునా అండగా నిలుస్తోంది. రైతులు దళారుల బారిన పడకుండా పంట నూర్పిడి చేసిన వెంటనే మద్దతు ధరతో దిగుబడులు కొనుగోలు చేయడం.. గడువు లోపు రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తుండటంతో సర్వత్రా హర్ష వ్యక్తమవుతోంది. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఈ ప్రభుత్వంలో కొనుగోళ్లు జరిగాయి. దళారుల ప్రవేశానికి ఎక్కడా ఆస్కారం లేకుండా పోయింది. మిల్లర్లు, బడా వ్యాపరస్థుల జోక్యానికి అడ్డుకట్ట పడింది. రైతు భరోసా కేంద్రాల ద్వారానే అవసరమైతే కల్లాల దగ్గరకే వెళ్లి కొనుగోళ్లు జరగడంతో రైతులు ఆనందంగా ఉన్నారు. తరుగు, తేమ శాతమని, ధర తగ్గిందనే వాదనలకు అవకాశం ఇవ్వకుండా కొనుగోళ్లు చేపట్టారు. ఫలితంగా రైతు నష్టాల నుంచి బయట పడ్డారు. దిగుబడులు అమ్ముకునేందుకు దళారులను ఆశ్రయించకుండా సీజన్ ప్రారంభానికి మునుపే రాష్ట్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర (మినిమం సపోర్ట్ ప్రైసెస్ - ఎంఎస్‌పీ) ప్రకటించింది. ఎంఎస్‌పీ కన్నా మార్కెట్‌లో ధర తక్కువగా ఉంటే ఎట్టి పరిస్థితుల్లోనూ అమ్ముకోవద్దని రైతులకు అవగాహన కల్పిస్తోంది. ప్రభుత్వమే రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి దిగుబడులు కొనుగోలు చేస్తూ నిర్దేశిత సమయం కన్నా ముందే చెల్లింపులు చేస్తుండటంతో రైతుల ముఖాల్లో ఆనందం కనిస్తోంది. జిల్లాలో 2022 మే నుంచి ఇప్పటి వరకు అధికారులు 2.24 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడులను మద్దతు ధరతో కొనుగోలు చేశారు. ఇందుకు గాను రూ. 546.12 కోట్లు రైతుల ఖాతాల్లో సకాలంలో జమ చేశారు. హమాలీ, సంచులు, రవాణా చార్జీలు సైతం రైతులకు అందజేడంతో ఆనందవ్యక్తమవుతోంది.



కొనుగోలు కేంద్రంలో పసుపు తూకం వేస్తున్న దృశ్యం

రైతు వద్దకే వెళ్లి..

రైతులు పండించిన ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతుపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా హమాలీ కూలీలు, గోనె సంచులు, రవాణా ఖర్చులను ప్రభుత్వమే భరిస్తోంది. పంట రైతుల ఇంటి వద్ద ఉన్నా.. కల్లంలో ఉన్నా సరే.. అధికారులు అక్కడికే వెళ్లి పంటను రైతుల ఎదుటే తూకం వేసి సంచులు సీల్ చేస్తారు. ఒకవేళ రైతులు గోనె సంచులు, హమాలీలు, రవాణ ఏర్పాటు చేసుకుంటే.. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఆ మొత్తాన్ని రైతుల ఖాతాల్లోకి పంట సొమ్ముతో పాటు జమ చేస్తున్నారు.

వారంలోగా నగదు జమ

కొనుగోలు చేసిన పంటలకు సంబంధించి నగదును రైతులకు ప్రభుత్వం వారం రోజుల లోపు చెల్లిస్తోంది. సెలవు దినాలు లేకుంటే రెండు, మూడు రోజుల్లో చెల్లింపులు జరుగుతాయి అని చెపుతున్నప్పటికీ. తూకం వేయడం పూర్తయినట్లు రికార్డుల్లో నమోదైతే గంట లోపే.. అది అర్ధరాత్రి అయినా రైతు ఖాతాలో నగదుజమ అవుతోంది. 24 గంటలు పనిచేసే బ్యాంకు అయితే అదే రోజు అర్ధరాత్రే రైతు నగదు డ్రా చేసుకునే అవకాశం కల్పించడం జరిగింది.



నాడు.. ధాన్యం విక్రయించేందుకు టోకెన్ కోసం ఆళ్లగడ్డ మార్కెట్ యార్డుకు తరలివచ్చిన రైతులు

నాడు దైవాధీనం

గత టీడీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు ధాన్యం కొనుగోళ్లను గాలికొదిలేసింది. ధాన్యం అమ్ముకోవాలంటే మార్కెట్ యార్డ్‌లకు వచ్చి రోజుల తరబడి క్యూలో నిల్చుని టోకెన్ తీసుకోవల్సిన దుస్థితి ఉండేది. ఆ పార్టీ నేతలు ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం తీసుకొచ్చి స్థానిక రైతుల పేరు మీద చూపించి అడ్డగోలుగా దోపిడీ చేశారు. 2018లో మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని మిల్లర్ల నుంచి మగ్గిపోయిన మినుములను కొనుగోలు చేసి ఆళ్లగడ్డ మార్కెట్ యార్డుకు లారీలతో తరలించి అప్పటి మంత్రి, వారి బంధువులు ఇక్కడి రైతుల పేరుమీద ప్రభుత్వానికి విక్రయించి రూ. కోటికి పైగానే దోచుకున్నారు. దీంతో పాటు ఇక్కడ పంట ఉత్పత్తులు ఏపీ రైతుల నుంచి కొనుగోలు చేయకున్నా కొన్నామని చూపించడం ద్వారా ప్రభుత్వం నుంచి క్వింటాల్‌కు రూ. 32 నుంచి రూ. 35 వరకు కమీషన్ రూపంలో నొక్కేసేవారు. రైతులకు ఇవ్వాల్సిన రవాణా ఖర్చులు, కూలీ, సంచుల ఖర్చులను కూడా స్వాహా చేసే వారు.

నేడు అడుగడుగునా ధైర్యం

అధికారంలోకి వచ్చిన వెంటనే ధాన్యం కొనుగోలులో సమూల మార్పులు తీసుకొస్తానని హామీ ఇచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. అనుకున్నట్లేగానే వినూత్న మార్పులు శ్రీకారం చుట్టి రైతులకు కొండంత ధైర్యాన్ని ఇచ్చారు. పల్లెల్లో ఆర్బీకేలను ఏర్పాటు చేసి రైతులకు కావల్సిన అన్ని సదుపాయాలు అక్కడ నుంచే కల్పించారు. ఈ-క్రాప్ విధానం ప్రవేశపెట్టడం, పంటలకు కనీస మద్దతు ధర కల్పించి రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేస్తున్నారు. అవసరమైతే గ్రామ గ్రామాన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు రైతుల కల్లాల దగ్గరకే వెళ్లి ధాన్యం తూకం వేసి తరలిస్తున్నారు. అవసరమైన హమాలీ, రవాణా చార్జీలతో పాటు ధాన్యం నిల్వ చేసే సంచులకు సైతం డబ్బులు చెల్లిస్తున్నారు. నిర్ణీత గడువులోపు రైతుల ఖాతాల్లోనే జమ చేస్తుండటంతో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా రైతు కష్టానికి నికచ్చిగా ఫలితం దక్కుతుంది.



కల్లంలో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న ఆర్బీకే సిబ్బంది

రెండేళ్లలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ఉత్పత్తులు, రైతులకు చెల్లించిన మొత్తం

పంట	కొనుగోలు మెట్రిక్ టన్నులు	రైతుల ఖాతాల్లో జమ చేసిన మొత్తం (రూ..లలో)
సజ్జ	1,890.9	4,07,69,600
వెరుశనగ	41.160	21,71,190
కొర్ర	10.900	2,72,500
మొక్కజొన్న	1,54,673.1	242,83,04,094
జొన్న	39,716.85	105,19,17,966
శనగ	25,652.15	133,44,13,365
పసుపు	2,203.04	8,04,24,041
	2,24,188	546,12,67,137



కొనుగోలు కేంద్రానికి వచ్చిన పసుపు దిగుబడి

దళారుల బెడదలేదు



నాకు 12 ఎకరాల పొలం ఉంది. ఏటా వివిధ రకాల పంటలు సాగు చేస్తాను. రెండేళ్ల నుంచి మా గ్రామంలోనే రైతు భరోసా కేంద్రం ద్వారా టోకెన్ తీసుకుని పంట దిగుబడులను విక్రయిస్తుంటాను. అమ్మిన ప్రతిసారి వారం రోజుల్లోనే నగదు నా బ్యాంకు ఖాతాలో జమ అవుతోంది. సంచుల నుంచి కూలీలను కూడా ప్రభుత్వమే చెల్లిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఎప్పుడూ ఇలా లేదు. రైతులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందుకుంటుంది.

– అంబటి విశ్వనాథరెడ్డి, రైతు, జి.జమ్ములదిన్నె

ప్రభుత్వం చొరవతో రూ. 4 లక్షలు అదనంగా లాభం



5 ఎకరాల్లో పసుపు పంట సాగు చేయగా సుమారు 180 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. దళారులు క్వింటా రూ. 4 వేలు కన్నా పోదని అడుగుతుండటంతో ఆందోళనగా ఉండేది. ప్రభుత్వం రూ. 6,850 మద్దతు ధర నిర్ణయించి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసింది. దీంతో ఆళ్లగడ్డ మార్క్‌ఫెడ్‌కు తరలించి మద్దతు ధరకు విక్రయించా. బయటి మార్కెట్ కంటే అదనంగా సుమారు రూ. 4 లక్షలకు పైగానే ప్రభుత్వం ఆదాయం చేకూర్చింది.

– లక్ష్మీనరసమ్మ, రైతు, చిన్నవంగలి

రైతు వద్దకే వెళ్లి కొనుగోలు



రైతుల నుంచి ప్రతి గింజ కొనుగోలు చేసి వారికి మద్దతు ధర అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా రైతు తను పంటను నిల్వ చేసుకున్న ప్రదేశానికి వెళ్లి ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్ ధరతో కొనుగోలు చేస్తున్నాం. కొనుగోలు క్రమంలో రైతుపై ఎలాంటి ఆర్థిక భారం పడకూడదని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చింది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ దళారుల బెడద నుంచి బయట పడుతున్నారు

– నాగరాజు, మార్క్‌ఫెడ్ డీఎం, నంద్యాల జిల్లా

సీఎం జగన్ రైతు పక్షపాతి



రైతులకు చెక్‌ను అందజేస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు, వంగాల భరత్ కుమార్ రెడ్డి తదితరులు

- ఇన్‌పుట్ సబ్సిడీ నిధులు విడుదల
- జిల్లాలో 27,138 మంది రైతులకు 26.87 కోట్ల జమ
- కలెక్టర్ శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి

నంద్యాల(సెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని కలెక్టర్ శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి అన్నారు. 2023 ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులతో పంట దెబ్బతిన్న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి విడుదల చేశారు. ఏ సీజన్‌లో జరిగిన పంట నష్టానికి ఆ సీజన్ ముగిసేలోగానే పరిహారం అందించడంలో భాగంగా రైతన్నలకు ఇన్‌పుట్ సబ్సిడీని జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని నంద్యాల కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ కె శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రావు తదితరులు వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం జిల్లాలో ఆరు కరువు మండలాలుగా ప్రకటించి ఇన్‌పుట్ సబ్సిడీ కింద 27,138 మంది రైతులకు 26.87 కోట్లు జమ చేసిందన్నారు. బేతంచెర్ల మండలంలో 11,999 మంది రైతులకు 11.12 కోట్లు, బనగానపల్లె మండలంలో 4,888 మందికి 4.89 కోట్లు, గడివేముల మండలంలో 1,030 మందికి 1.08 కోట్లు, మిడుతూరు మండలంలో 5,605 మందికి 6.1 కోట్లు, పగిడ్యాల మండలంలో 3,264 మంది రైతులకు 3.2 కోట్లు, పాణ్యం మండలంలో 352 మందికి 4.1 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఏ సీజన్‌లో పంట నష్టపోయిన రైతులకు అదే సీజన్‌లో ఇన్‌పుట్ సబ్సిడీని ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లుగా రైతుల కోసం వైఎస్ఆర్ రైతు భరోసా కింద ఏటా రూ.13,500 ఇస్తున్నారని, వైఎస్ఆర్ సున్నా వడ్డీని అందిస్తున్నారని చెప్పారు. రూపాయి ఖర్చు లేకుండా వైఎస్ఆర్ పంటల బీమాను వర్తింపజేస్తున్నారన్నారు. ఊరూరా రైతుల కోసం ఆర్‌బీకేలు నిర్మించి పంటలకు అవసరమైన మందులు, ఎరువులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ తదితరులు రైతులకు చెక్కును అందజేశారు.

భక్తులకు పటిష్ట భద్రత

- ఎస్పీ రఘువీర్‌రెడ్డి

శ్రీశైలం: మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలం తరలివచ్చే భక్తులకు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టామని ఎస్పీ రఘువీర్‌రెడ్డి అన్నారు. బుధవారం శ్రీశైలం చేరుకున్న ఆయన క్షేత్ర పరిధిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. హరిహర రాయ గోపురం, మల్లమ్మ కన్నీరు, నంది మండపం, ఆర్టీసీ బస్టాండ్, నంది సర్కిల్, టోల్ గేట్, సాక్షి గణపతి, ముఖద్వారం, పాలధార పంచదార, శివాజీ గోపురం తదితర ట్రాఫిక్ పాయింట్లను ఆకస్మికంగా పరిశీలించారు. అనంతరం సిబ్బందికి కేటాయించిన బ్యారెక్స్‌ను సందర్శించి వసతులపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సందర్భంగా మొత్తం బందోబస్తు సిబ్బందిని 9 సెక్టార్లుగా విభజించామన్నారు. వాహనాల నియంత్రణకు క్షేత్రాన్ని 10 జోన్లగా ఏర్పాటు చేసి సిబ్బందికి విధులు అప్పగించామన్నారు. 1,619 మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎస్పీ వెంట అడ్మిన్ అడిషనల్ ఎస్పీ కె.ప్రవీణ్ కుమార్, ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, శ్రీశైలం ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, టూటౌన్ ఎస్ఐ గంగయ్య యాదవ్ పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి



పుష్ప పల్లకీ గ్రామోత్సవాన్ని తిలకిస్తున్న భక్తజనం

వైభవం.. పుష్ప పల్లకోత్సవం

- పుష్పపల్లకీలో విహరించిన భ్రామరీ సమేత మల్లన్న
- కనులారా తిలకించి తరించిన భక్తజనం
- వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవ సంబరాలు

శ్రీశైలంటెంపుల్: మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలతో శ్రీగిరి క్షేత్రం ఇల కైలాసాన్ని తలపిస్తోంది. శివ భక్తులు మల్లన్న దర్శనానికి తరలివస్తున్నారు. బ్రహ్మోత్సవ సంబరాలు అంబరాన్ని తాకుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో 6వ రోజు బుధవారం భ్రమరాంబసమేత మల్లికార్జునుడు పుష్పపల్లకీలో కొలువై దేదీప్యమానంగా భక్తులకు దర్శనమిచ్చారు. క్షేత్రంలోని తూర్పు, దక్షిణ మాడవీధుల్లో జరిగిన పుష్పపల్లకీ గ్రామోత్సవంలో లక్షలాది మంది భక్తులు పాల్గొన్నారు. వివిధ రకాల సుగంధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేశారు. ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు ప్రత్యేక పూజా హారతులిచ్చారు. గ్రామ పురవీధుల్లో ఉత్సవమూర్తులు పల్లకీలో విహరిస్తుండగా అశేష భక్తజనవాహిని కనులారా దర్శించి కర్పూర నీరాజనాలు సమర్పించారు. గంగాధర మండపం నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం నందిమండపం, బయలు వీరభద్రస్వామి ఆలయం మీదుగా రాజగోపురం వరకు సాగింది. జానపద కళాకారుల నృత్య ప్రదర్శనలు, డ్రమ్స్, డప్పులు, తప్పెట్లు, మేళతాళాలు, భజంత్రీలు, శంఖానాదాల కోలాహలం నడుమ గ్రామోత్సవం నేత్రానందభరితంగా సాగింది. పూజా కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈవో డి.పెద్దిరాజు దంపతులు సిబ్బంది పాల్గొన్నారు.



స్వామి అమ్మవార్లకు పూజలు చేస్తున్న పండితులు



డోలు వాయిద్య కళాకారుల ప్రదర్శన

శ్రీశైలంలో నేడు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవరోజు గురువారం సాయంత్రం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు గజవాహనసేవ, గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహిస్తారు.

నామినేషన్ల ప్రక్రియపై అవగాహన అవసరం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డితో కలసి ఎన్నికల ప్రవర్తన నియమావళి, నామినేషన్ల ప్రక్రియ తదితర అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు నామినేషన్ల ప్రక్రియపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు ఎన్నికల్లో ఏం చేయాలి.. ఏం చేయకూడదు అన్న అంశాలపై పూర్తి స్పష్టత ఉండాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉల్లంఘించరాదన్నారు. ఎన్నికల్లో నామినేషన్ ప్రక్రియ చాలా ముఖ్యమైనదని, వీలైనంత వరకు ముందుగానే నామినేషన్ వేసుకునేలా అభ్యర్థులకు తెలియజేయాలన్నారు. సంబంధిత ఆర్ఓ ముందుగానే చెక్ చేసుకుని ఏదైనా వివరాలు అవసరమైతే సమాచారం అందిస్తారన్నారు. పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణపై సంబంధిత రిటర్నింగ్ అధికారుల నుండి ప్రతిపాదనలు తీసుకొని ఎన్నికల కమిషన్‌కు సమర్పిస్తామని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. వైఎస్ఆర్‌సీపీ నుంచి రామిరెడ్డి, నరసింహారెడ్డి, అనిల్ అమృతరాజ్, టీడీపీ నుంచి హరి, ప్రసాద్ రెడ్డి, ఆంజనేయులు, బీజేపీ నుంచి చంద్రశేఖర్, కాంగ్రెస్ నుంచి రియాజ్ బాషా, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉద్యోగాలకు నేడు ఇంటర్వ్యూలు

నంద్యాల(అర్బన్): జిల్లా బాలల సంరక్షణ విభాగం మిషన్ వాత్సల్య సఖి వన స్టాప్ కేంద్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా స్త్రీ,శిశు అభివృద్ధి సాధికారత అధికారిణి నిర్మల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పర్యవేక్షణలో ఏర్పాటైన ఖాళీల భర్తీకి ఇటీవల పరీక్షలు నిర్వహించి మెరిట్‌లిస్ట్, షార్ట్‌లిస్ట్‌లను జిల్లా వెబ్‌సైట్ టీటీటీ.ఽ్ఝఽఛీఠీ్చ .్చp.జౌఠి. జీn లో చూపడమైందన్నారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని డీఆర్వో కార్యాలయంలో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. అభ్యర్థులు తమ మార్క్స్‌లిస్టులు, ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు తీసుకు రావాలన్నారు.

ఆశాజనకంగా ఎండుమిర్చి ధరలు

నంద్యాల(సెంట్రల్): పట్టణంలోని మిర్చి యార్డులో ఎండుమిర్చి ధరలు ఆశాజనకంగా కొనసాగుతున్నాయి. బుధవారం సూపర్-10, నంబర్-5 రకం సరకు అమ్మకాలు జరిగాయి. సూపర్-10 రకం జనరల్ క్వింటాలు గరిష్ఠ ధర రూ.15,000, మధ్యస్థ ధర రూ.14,000, కనిష్ఠ ధర రూ.12,800గా నమోదైంది. ఇదే రకం తాలు కాయ జనరల్ గరిష్ఠ ధర క్వింటాలు రూ.6,900, మధ్యస్థ ధర రూ.5,500, కనిష్ఠ ధర రూ.5,000గా పలికింది. నంబర్-5 రకం జనరల్ గరిష్ఠ ధర క్వింటాలు రూ.16,400, మధ్యస్థ ధర రూ.14,000, కనిష్ఠ ధర రూ.11,300గా నమోదైనట్లు యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పన ఓ ప్రకటనలో తెలిపారు. అన్నదాతలు దళారులను నమ్మి మోసపోకుండా యార్డులోని ధ్రువీకత వ్యాపారస్తుల వద్ద సరకు అమ్ముకొని మంచి ధరను పొందాలని సూచించారు.

మద్యం పట్టివేత



మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు

వెలుగోడు: అక్రమంగా నిల్వ ఉంచి మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ భూపాలుడు కథనం మేరకు వివరాలు ఇలా.. బుధవారం ఉదయం వెలుగోడులోని చెంచు కాలనీలో గండికోట రామచంద్రుడు, షేక్ మాబున్ని అక్రమంగా వివిధ రకాల మద్యం సీసాలను నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని గోవా రాష్ట్రానికి చెందిన మొత్తం 53 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

కృషి సఖిలకు విస్తృత శిక్షణ

నంద్యాల(సెంట్రల్): గ్రామస్థాయి వరకు ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించేందుకు నియమించిన కృషి సఖిలకు విస్తృత శిక్షణ ఇస్తున్నట్లు ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజరు నరేంద్ర రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వయం సహాయక సంఘాల వీవోఏ (విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్)ల నుంచి జిల్లా వ్యాప్తంగా 86 మందిని కృషిసఖిలుగా ఎంపిక చేసి 5 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఇందులో మొదటి రోజు డివిజన్ స్థాయిలో, రెండో రోజు నుంచి మండల స్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. డీఆర్‌డీఏ, రైతు సాధికార సంస్థ(ఆర్‌వైఎస్ఎస్) సంయుక్తంగా చేపడుతున్న ఈ శిక్షణ కార్యక్రమాల్లో ప్రకృతి వ్యవసాయ సార్వత్రిక సూత్రాలు, రైతులకు నిరంతర ఆదాయం కోసం 365 డీజీసీ మోడల్స్-ఏ గ్రేడ్, తోటల పెంపకంపై ఆచరణాత్మక శిక్షణ ఇస్తున్నామని వివరించారు.



పల్లకీ సేవలో డీఐజీ విజయరావు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, ఈఓ పెద్దిరాజు తదితరులు



డోలు కళాకారుల ప్రదర్శన



మహిశాసుర మర్దిని నృత్య రూపకం



పల్లకీ సేవను తిలకిస్తున్న భక్తజనం



కైలాస ద్వారం వద్ద నందిని దర్శించుకుంటున్న పాదయాత్ర భక్తులు

శివ శంకర.. భక్తవ శంకర

దారులన్నీ శ్రీశైలం వైపు అన్నట్లుగా భక్తజనం కదలివస్తోంది. శివరాత్రి బ్రహ్మోత్సవాల వేళ అంతా శివ మయవుతోంది. నల్లమల మీదుగా పాదయాత్ర భక్తులు తరలి వస్తున్నారు. ఓ వైపు ఉత్సవ సంబరం.. మరో వైపు భక్తజన సందడి వెరసి శ్రీగిరి కళకళలాడుతోంది.

– శ్రీశైలం టెంపుల్



పాతాళ గంగలో పుణ్య స్నానాలకు పోటెత్తిన భక్తులు



పాదయాత్రగా శ్రీశైలం చేరుకుంటున్న భక్తులు, శివ స్వాములు

గుండ్ల బ్రహ్మేశ్వరుడి దర్శనానికి అనుమతి

- మహాశివరాత్రి రోజున 75 వాహనాలకు మాత్రమే ప్రవేశం



ఆలయంలో శివలింగం

మహానంది: మహాశివరాత్రి సందర్భంగా నల్లమలలోని నంద్యాల రేంజ్ పరిధిలోని గుండ్ల బ్రహ్మేశ్వర ఆలయం సందర్శనకు అటవీశాఖ అధికారులు అనుమతి ఇస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 8న మహాశివరాత్రి సందర్భంగా 75 వాహనాలకు మాత్రమే అనుమతి ఇస్తామన్నారు. వాహనాలు ఉదయం 6 గంటలకు బయలుదేరి సాయంత్రం 6 గంటలకు తిరిగి రావాల్సి ఉంటుందన్నారు. అడవి ఉత్పత్తులను వాహనాల్లో తీసుకెళ్లరాదన్నారు. ప్లాస్టిక్ వస్తువులు తీసుకెళ్లరాదని, అగ్గిపెట్టెలు, ఇతర అగ్నికి సంబంధించిన వస్తువులు నిషేధమన్నారు. రిజర్వ్ ఫారెస్ట్ అభయారణ్యం కావడంతో నిబంధనలు పాటించాలన్నారు. అడవిలో గంటకు పది కిలోమీటర్ల వేగంతో మాత్రమే వెళ్లాలన్నారు. ఇదిలా ఉండగా గుండ్ల బ్రహ్మేశ్వరం ఆలయానికి ప్రతి ఏడాది మహాశివరాత్రి రోజున బండిఆత్మకూరు మండలం నారాయణాపురం గ్రామానికి చెందిన భక్తులు ఎస్ఆర్ కుంట మీదుగా కాలినడకన వెళ్లి శ్రీ గుండ్లబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తారు. ప్రకృతి రమణీయత మధ్య వెలిసిన గుండ్లబ్రహ్మేశ్వరస్వామి దర్శనానికి భక్తులు ఆసక్తి చూపుతారు.

మల్లన్న 'మహా ప్రసాదం'

- శివరాత్రి బ్రహ్మోత్సవాలకు 35 లక్షల లడ్డూ ప్రసాదాలు
- ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయాలు





లడ్డూ ప్రసాదాన్ని తయారు చేస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: మల్లన్న భక్తులకు ఎంతో ఇష్టమైనది లడ్డూ ప్రసాదం. శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనం అనంతరం భక్తులు ఇష్టంగా మల్లన్న లడ్డూ ప్రసాదాన్ని కొనుగోలు చేస్తారు. అలాగే బంధుమిత్రులకు ప్రసాదాన్ని తీసుకెళ్తారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవ సమయంలో లడ్డూ ప్రసాదానికి డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సుమారు 10లక్షలకు పైగా భక్తులు తరలివస్తారనే అంచనాతో 35 లక్షల లడ్డూలను సిద్ధం చేసి అందజేస్తున్నారు. రద్దీ నేపథ్యంలో అదనపు కౌంటర్లను ఏర్పాటు చేసి ప్రసాదాలను విక్రయిస్తున్నారు. దేవస్థానం లడ్డూ పోటులో ఉన్న 35 మంది సిబ్బందితో పాటు బ్రహ్మోత్సవాలకు ప్రత్యేకంగా విజయవాడ, ఇతర ప్రాంతాల నుంచి సుమారు 150 మంది సిబ్బందిని పిలిపించి లడ్డూ ప్రసాదాల తయారీ చేస్తున్నారు. భక్తులు అడిగినన్ని లడ్డూ ప్రసాదాలను ఇచ్చేందుకు దేవస్థాన అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. భక్తులు మహా ప్రసాదంగా భావించి మల్లన్న లడ్డూ నాణ్యత, పరిమాణం ఖచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఈఓ పెద్దిరాజు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా రద్దీ నేపథ్యంలో ఈ ఏడాది నూతనంగా గణేశ సదనం వద్ద లడ్డూ కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు.

బతుకు బాటలో మృత్యుఒడికి..

- నల్లమల ఘాట్ రోడ్డులో ప్రమాదం
- భర్త మృతి, భార్యకు గాయాలు

ఆత్మకూరురూరల్: శివరాత్రి సందర్భంగా కోటప్ప కొండపై జరిగే ఉత్సవంలో బొమ్మలు అమ్ముకుని జీవనోపాధి పొందాలని బయలుదేరిన దంపతులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో భర్త మృతి చెందగా, భార్య స్వల్ప గాయాలతో బయటపడింది. కళ్ల ముందే భర్త మృతితో మహిళ రోదిస్తున్న తీరు పలువురిని కలిచి వేసింది. ఆత్మకూరు పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. కల్లూరు మండలం పందిపాడుకు చెందిన భార్యాభర్తలు ఉగ్గన్న, లక్ష్మీలు ఏటా శివరాత్రికి బొమ్మలు, పూసల దండలు విక్రయించేందుకు కోటప్పకొండకు వెళుతుంటారు. అందులో భాగంగా బుధవారం ఇద్దరూ బైక్‌పై వెళ్తుండగా ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని బైర్లూటీ – రోళ్లపెంట మధ్యలో ఎదురుగా వస్తున్న టాటా క్యాంపర్ వాహనం వేగంగా ఢీకొంది. దీంతో ఉగ్గన్న తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. లక్ష్మి స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడింది. ఆత్మకూరు ఎస్ఐ ఎన్. నారాయణ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ఉగ్గన్న మృతదేహాన్ని ఆత్మకూరు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

కరివేన సమీపంలో..

ఆత్మకూరు మండలం కరివేన గ్రామం వద్ద జరిగిన మరో ప్రమాదంలో ద్విచక్రవాహనంలో కర్నూలుకు వెళ్తున్న శ్రీనివాసులు అదుపు తప్పి కింద పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమించడంతో వైద్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు.

పారుమంచాల సచివాలయ ఉద్యోగులకు మెమోలు



ఉదయం 11 గంటలైనా తెరుచుకోని తలుపులు

జూపాడుబంగ్లా: సకాలంలో విధులకు హాజరుకాని పారుమంచాల సచివాలయ ఉద్యోగులపై ఎంపీడీఓ నూర్జహాన్, జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో సచివాలయ పరిశీలనకు వెళ్లిన వారికి తాళం వేసి ఉండటంతో అవాక్కయ్యారు. పరిశీలనకు వస్తున్నట్లు సిబ్బందికి ముందుగానే సమాచారం ఇచ్చినా ఒక్కరూ కూడా హాజరు కాకపోవడంతో మండిపడ్డారు. ఈ విషయాన్ని జిల్లా అధికారులకు తెలియజేయటంతో పాటు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన తొమ్మిది మంది సచివాలయ ఉద్యోగులకు మెమోలు జారీ చేశారు. మెమోలకు సరైన సమాధానం ఇవ్వకపోతే షోకాజ్ నోటీసు జారీచేస్తామని ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. సచివాలయ ఉద్యోగులు ఎవ్వరైనా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేదిలేదని ఎంపీడీఓ తెలిపారు.

అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో పటిష్ట నిఘా

కర్నూలు(సెంట్రల్): సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో పటిష్ట నిఘా ఉంచాలని, ఇందుకు బళ్లారి, రాయచూరు జిల్లాల అధికారులు సహకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్ కోరారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి బళ్లారి, రాయచూరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాకు తెలంగాణతోపాటు కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరు, బళ్లారి జిల్లాలతో అంతర్రాష్ట్ర సరిహద్దు ఉందన్నారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల నుంచి అక్రమంగా మద్యం, డబ్బు సరఫరా కాకుండా నిఘా ఉంచాలన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టే విధంగా ఉన్న కార్యకలాపాలను నియంత్రించడంలో తగిన సహకారం అందించాలని కోరారు. ఎస్పీ జి.కృష్ణకాంత్ మాట్లాడుతూ..రాయచూరు జిల్లాలోని రాయచూరు రూరల్ అసెంబ్లీ, బళ్లారి జిల్లాలోని మాన్వి, సిరిగుప్ప, మోకా, కంప్లీ అసెంబ్లీ నియోజకవర్గాలు జిల్లాకు సరిహద్దుగా ఉన్నాయన్నారు. జిల్లాలోని ఆలూరు, ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాలు కర్ణాటక రాష్ట్రానికి సరిహద్దుగా ఉన్నాయన్నారు. జిల్లా సరిహద్దులో ఐదు ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

మయూర వాహనంపై మహానందీశ్వరుడు



గ్రామోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

మహానంది: మహానంది క్షేత్రంలో బుధవారం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, రుత్వికుల ఆధ్వర్యంలో ధ్వజారోహణ పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. రాత్రి మహానందీశ్వర దంపతులు మయూరవాహనంపై కొలువై ఆలయ ప్రాంగణంలో విహరించారు. ఉత్సవాలు ప్రారంభం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మహానందీశ్వరుడి గ్రామోత్సవం తిలకించి మహానందీశ్వరా...నమో నమః అంటూ ప్రణమిల్లారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.



ధ్వజ పటాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం



పూజలు నిర్వహిస్తున్న పండితులు

గ్రానైట్ క్వారీల తనిఖీ

కర్నూలు (నూటౌన్): పత్తికొండ మండలంలోని పలు గ్రానైట్ క్వారీలను బుధవారం తనిఖీ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ తెలిపారు. దూదేకొండలో ఎస్‌వి మెటల్ స్టోన్ క్రషర్‌తో పాటు మరో గ్రానైట్ క్వారీని తనిఖీ జిల్లా మైనింగ్ విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారన్నారు. తనిఖీల్లో జిల్లా మైనింగ్ విజిలెన్స్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్ పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌లో చోరీ



సీసీ కెమెరా ఫుటేజీలో అనుమానుతుడు

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలో బుధవారం ఓ అపార్ట్‌మెంట్‌లో గుర్తుతెలియని దొంగ చోరీకి పాల్పడ్డాడు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. ఎస్‌బీఐ కాలనీలోని సాయితేజ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న బాలు అనే వ్యక్తి ఫైనాన్స్, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. బాలు తన భార్యతో కలిసి ఇంటికి తాళం వేసి బుధవారం మధ్యాహ్నం షాపింగ్‌కు వెళ్లాడు. అంతలో ఓ దొంగ అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించి తాళాలు వేసిన ఇళ్లకోసం గాలించాడు. ఈ క్రమంలో మూడవ అంతస్తులోని 301 ప్లాటుకు తాళం వేసి ఉండటాన్ని గమనించిన దొంగ వెంటనే గడియను ఇనుప రాడ్‌తో వంచి తలుపులు తెరచి ఇంట్లోకి ప్రవేశించాడు. బెడ్‌రూమ్‌లో ఉన్న బీరువాపైన తాళం గుర్తించి బీరువాలోని రూ. 5 లక్షల నగదు, 10 తులాల బంగారు ఆభరణాలతో ఉండాయించాడు. షాపింగ్ పూర్తి చేసుకుని ఇంటికి వచ్చిన దంపతులు తలుపులు తెరిచి ఉండటం చోరీ జరిగిందని గుర్తించారు వెంటనే ఫిర్యాదు అందుకున్న పోలీసులు అపార్ట్‌మెంట్‌కు చేరుకుని సీసీ కెమెరాలను పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తి మాస్కు ధరించి అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దొంగ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు సీఐ రాజారెడ్డి తెలిపారు.

పోలింగ్ కేంద్రాల మార్పునకు చర్యలు

కర్నూలు(సెంట్రల్): పోలింగ్ కేంద్రాల పేర్లు, లోకేషన్ల మార్పునకు చర్యలు తీసుకుంటున్నామని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను జిల్లా కలెక్టర్ డాక్టర్‌జి.సృజన కోరారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం ఆమె సమావేశం నిర్వహించారు. కొన్ని ప్రాంతాల్లో స్కూళ్లు ఎలిమెంటరీ నుంచి ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల స్థాయి అప్‌గ్రేడ్ అయ్యాయని, వాటి పేర్లను మార్పు చేస్తామన్నారు. అలాగే కొన్ని పాఠశాలల ఉండే ప్రదేశాల పేర్లు కూడా మార్పు చెందాయని, దీంతో లోకేషన్లను మార్పు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీఎస్‌పీ నుంచి ఎ.అరుణ్‌కుమార్,బీజేపీ నుంచి పీటీ సాయిప్రదీప్, వైఎస్‌ఆర్‌సీపీ నుంచి ఎస్.రాజేష్, కాంగ్రెస్ నుంచి జాన్ విల్సన్, టీడీపీ నుంచి ఎల్‌వీ ప్రసాదు, సీపీఎం నుంచి డి.గౌస్‌దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

గుడేకల్ కొండల్లో కార్చిచ్చు

- భయాందోళనలో కొండపక్క గ్రామాల ప్రజలు



గుడేకల్ కొండల్లో రాత్రి 10 గంటల ప్రాంతంలో ఎగిసిపడుతున్న మంటలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామ కొండల్లో కార్చిచ్చు చెలరేగింది. సాయంత్రం చిన్నగా మొదలైన మంటలు రాత్రి 10 గంటల ప్రాంతంలో పెద్ద ఎత్తున వ్యాప్తించాయి. ఈ మంటలు కొండచుట్టూ పాకే అవకాశం ఉంది. మంటలను అదుపు చేయటం కష్టం కావటంతో కొండపక్క గ్రామాలైన హనుమాపురం, గుడేకల్ ప్రజలు భయపడుతున్నారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించినా.. కొండల్లో వెళ్లటం సాధ్యం కావడం లేదు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించటంతో ఈ మంటలు వ్యాపించినట్లు తెలుస్తోంది.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతి చెందిన రైతు బ్రహ్మానందరెడ్డి

బనగానపల్లె రూరల్: యనకండ్ల గ్రామానికి చెందిన ఓ రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన ఎం. బ్రహ్మానందరెడ్డి(50), లక్ష్మీదేవి దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. బ్రహ్మానందరెడ్డి తనకు ఉన్న ఐదున్నర ఎకరాల పొలంలో వరి సాగు చేశాడు. మంగళవారం సాయంత్రం పంటకు నీరు కట్టేందుకు వెళ్లి విద్యుత్ పంపు సెట్‌ను ఆన్ చేశాడు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించేందుకు వెళ్లాడు. అక్కడ కిందకు వేలాడుతున్న తీగలు చేతికి తాకడంతోవిద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. రాత్రయినా బ్రహ్మానందరెడ్డి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనతో పొలం వద్దకు వెళ్లి చూడగా విగతజీవిగా పడి ఉండటంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఎస్ఐ రామిరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.